క్లుప్తంగా

కుర్చీల బహూకరణ

రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లలో గల అంగన్‌వాడీ కేంద్రానికి సోమవారం కుర్చీలను బహుకరించారు. గ్రామానికి చెందిన సరికొండ పద్మ అంగన్‌వాడీ కేంద్రానికి 20 కుర్చీలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ అంగన్‌వాడీ టీచర్ బి.లక్ష్మీ, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి పది మంది విద్యార్థులు ఎంపిక

శావల్యాపురం: మండలం నుంచి పది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈవో సాంబశివరావు సోమవారం తెలిపారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఈ అవకాశం దక్కినట్లు ఆయన తెలిపారు. శావల్యాపురం జెడ్పీ పాఠశాల నుంచి పి.సత్య, పి.జోతిర్మయి, ఎల్.గాయత్రి, సి.హెచ్.నాగలక్ష్మి, ఎ.అమృత వర్షిణి, టి.కాత్యాయని, ఎం.సప్నిక, రత్న వేల్పూరు పాఠశాల నుంచి కామేపల్లి నాగ రోషిణి, మానం జస్వంత్, పోట్లూరు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి సాలసా రూపశ్రీ అర్హత సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఆరు సంవత్సరాలు పాటు ఉచిత బోధనతో పాటు వసతి సౌకర్యం వీరు పొందుతారన్నారు.

పరిష్కార వేదికలో మూడు ఫిర్యాదులు

యడ్లపాడు: సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మూడు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. మండలంలోని ఉన్నవ గ్రామంలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురి అవుతుందని దానిని పరిరక్షించాలని గ్రామానికి చెందిన కూరాకుల సురేష్ ఫిర్యాదు చేశాడు. అలాగే మర్రిపాలెం, సొలస గ్రామాల్లో ఉన్న తమ భూములకు తాలూకు ఆధార్ డీసీడింగ్ చేయాలంటూ చెరుకుపల్లి హనుమంతరావు, పోతురాజు మోహన్‌రావు వినతులు అందజేశారు.

యువకుడికి తీవ్ర గాయాలు

నాదెండ్ల: జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన గణపవరం గ్రామంలో ఎంఎల్ టుబాకో కంపెనీ ఎదురు సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ప్రకాశం జిల్లా మార్టూరుకు చెందిన తన్నీరు శ్రీకాంత్ ద్విచక్రవాహనంపై గుంటూరు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎంఎల్ టుబాకో కంపెనీ వద్దకు రాగా తన తలకు ఉన్న టోపీ ముందుకు జారింది. టోపీని సరిచేసుకునే క్రమంలో ముందు వెళ్తున్న లారీకి ద్విచక్రవాహనం తగిలింది. దీంతో అదుపుతప్పి కిందపడి ఎడమ మోకాలు విరిగింది. క్షతగాత్రుడిని గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి చేయాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పిలుపు



డాక్టర్ గోపిరెడ్డిని సన్మానిస్తున్న హెల్దా ఫ్లోరెన్స్, అచ్చి శివకోటి

నరసరావుపేట: నూతనంగా నియమితులైన వారందరూ వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషిచేస్తూ మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అంగన్వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జొన్నలగడ్డ హెల్దా ఫ్లోరెన్స్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన అచ్చి శివకోటి సోమవారం పార్టీ కార్యాలయంలో వేర్వేరుగా డాక్టర్ గోపిరెడ్డిని కలిసి తమ నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తూ దుశ్శాలువ, పూలదండలతో సత్కరించారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ పార్టీకోసం పని చేస్తున్న హెల్దా ఫ్లోరెన్స్, అచ్చిశివకోటి పలు పదవుల్లో నియమితులు కావటం సంతోషంగా ఉందన్నారు. పార్టీ జెండా ఎగురవేయడానికి కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు కుర్చీలో కూర్చున్నా.. ప్రజలు ఆరాధించేది వై.ఎస్.జగన్‌నే అన్నారు. శివకోటి బీసీ సామాజిక వర్గానికి గత ఎనిమిది ఏళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, గత ఎన్నికల్లో బీసీ వర్గీయులు పార్టీకి పని చేశారని, ప్రజలందరూ జగన్‌ను ఓడించి పొర పాటు చేశామనే భావంలో ఉన్నారని, ఆయన చేసిన మేలు మర్చిపోలేకపోతున్నారని, తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ప్రజలందరూ చెబుతున్నారని, రాబోయే రోజుల్లో తిరిగి పార్టీ జెండా ఎగురవేసి జగన్ మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శివకోటి మాట్లాడుతూ తనకు అప్పజెప్పిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని, ఎనిమిదేళ్లుగా బీసీ సెల్ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించారన్నారు. రాబోయే రోజుల్లో మేము ముగ్గురం కలిసి పట్టణంలో అన్ని వర్గాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు. గిరిజన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వర రావు, పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.సుజాతాపాల్, పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా, భారతి కోటిరెడ్డి, నాయకురాలు మల్లెల అనిలా, విజయలక్ష్మి, పలువురు నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు .

సంక్షిప్త వార్తలు

నేడు ఉపాధి పథకం ప్రజావేదిక

యడ్లపాడు: గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో 17వ విడత సామాజిక తనిఖీలు సోమవారంతో పూర్తయ్యాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 18 పంచాయతీల్లో ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పన, పలు అభివృద్ధి పనులు నిర్వహించారు. ఆయా తనిఖీల అంశాలను గ్రామసభలో వెల్లడించి అందరి ఆమోదమైన వాటిని 24వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగే ప్రజావేదికలో మండలస్థాయిలో వెల్లడించనున్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

నూజెండ్ల: వసతి గృహం నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కె.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వంటగది నిర్వహణ, మరుగుదొడ్లను పరిశీలించారు. సిబ్బంది గైర్హాజరు కావటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు అనుమతులు లేకుండా సెలవులో ఉండటంపై వంట సహాయకులపై అసహనం వ్యక్తం చేశారు. ఇదే విధంగా కొనసాగితే విధుల నుంచి తొలగించటం జరుగుతుందని చివరి అవకాశం ఇస్తున్నట్లు శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల దినోత్సవంలో హాస్టల్ సిబ్బంది కొరతపై గ్రామ సర్పంచ్ ఫిర్యాదు చేయటంతో జిల్లా కలక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేయటం జరిగిందన్నారు. జిల్లాస్థాయిలోని అన్ని బీసీ హాస్టల్స్‌లో సిబ్బంది కొరత ఉందని త్వరలో భర్తీ చేయటం జరుగుతుందని అన్నారు. విద్యార్థుల వసతులకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని వార్డెన్ ప్రభాకర్‌రెడ్డికి సూచించారు. ఆయనతో పాటు నూజెండ్ల గ్రామ ప్రసిడెంట్ వీర్ల వెంకటస్వామి ఉన్నారు.

ముంపు గ్రామాల్లో సర్వే

బొల్లాపల్లి: పోలవరం బనకచర్ల ప్రాజెక్టు పరిధిలోని బొల్లాపల్లి మండలం పరిధిలోని ముంపుకుగురయ్యే ఐదుగ్రామాలల్లో సర్వే బృందం సోమవారం క్షేత్రస్థాయిలో వివరాలు నమోదుచేశారు. రేమిడిచర్లలో జరుగుతున్న ఇంటింటి సర్వే జలవనరులశాఖ ఉన్నతాధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు. జలవనరుల శాఖ ఈ.ఈ శివరామ్ ప్రసాద్ సర్వేబృందాలకు సూచలనలు చేశారు. సర్వేపనుల్లో ఆటంకాలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని, ముంపు గ్రామాలల్లో సర్వేపనులు త్వరితగతిన పూర్తి త్వేయాలని ఆదేశించారు.

ఫీజులు నియంత్రించాలి

చిలకలూరిపేట: ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యం ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నారని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్, ఎంఈవో వీపీఎస్ చంద్రకళను కలసి సోమవారం వినతి పత్రాలు అందజేశారు. జీవో నంబర్ 53, 54 నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రైవేటు విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేయడంతో పాటు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చివేశారని విమర్శించారు.